క్లుప్తంగా

ఇబ్రహీంపట్నం ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు బదిలీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఏసీపీ ఉమా మహేశ్వరరావు సీసీఎస్ (హైదరాబాద్ సిటీ) ఏసీపీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ సోమవారం రాత్రి ఉత్తర్వులను జారీ చేశారు. ఆయన స్థానంలో ఇంటలిజెన్స్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ పోలీస్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావ్ ఇక్కడికి బదిలీపై వస్తున్నారు.

ఈజీఎస్ పనుల పరిశీలన



నీటి కుంట నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఎంపీడీఓ రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. గ్రామంలో వ్యవసాయ పొలాల్లో నీటి నిల్వకొరకు నిర్మిస్తున్న నీటి కుంటను వారు పరిశీలించారు. పనుల పురోగతిని ఈజీఎస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మైసిగండి గ్రామంలో రోడ్డుకిరువైపులా హరితాహారంలో భాగంగా మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి సత్యం, ఫీల్ అసిస్టెంట్ శ్రీను, ఉపాధిహామీ కూలీలు ఉన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించండి

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



మెప్మా సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

తుర్కయంజాల్: స్వచ్ఛ సర్వేక్షణ్–2023కు మున్సిపల్‌వాసులు అన్ని విధాలుగా సహకరించాలని కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో మెప్మా సిబ్బంది, ఆర్పీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సిబ్బందికి అవగాహన కల్పించి, మున్సిపల్ వాసుల అభిప్రాయాలను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఫీడ్ బ్యాక్ ఇచ్చేలా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కూడా కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్, మెప్మా కోఆర్డినేటర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

‘గ్రామాభివృద్ధికి నిధులివ్వండి’



ఎమ్మెల్యే మంచిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

యాచారం: గ్రామాభివృద్ధికి రూ.30 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి నానక్‌నగర్ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామ సర్పంచ్ పెద్దయ్య ఆధ్వర్యంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాంచంద్రయ్యతో పాటు పలువురు వార్డు సభ్యులు, వివిధ రాజకీయ పక్షాల నాయకులు ఎమ్మెల్యేను కలిసి గ్రామంలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మించడానికి నిధులు ఇవ్వాలని కోరగా తక్షణమే రూ.15 లక్షల నిధులు ఇస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మరో రెండు, మూడునెలల తర్వాత మిగితా నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సర్పంచ్ పెద్దయ్య తెలిపారు.

పోస్టుకార్డులతో నిరసన తెలుపుదాం

వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్

తుర్కయంజాల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఐజేయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన పోస్టుకార్డు ఆందోళన కార్యక్రమంలో జిల్లాలోని జర్నలిస్టులంతా పాలుపంచుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్ కుమార్ కోరారు. మంగళవారం ఆయన తుర్కయంజాల్‌లో మాట్లాడుతూ.. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి పోస్టు కార్డు రాసి నిరసన తెలపుదామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించిన జర్నలిస్టులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం విచారకరమన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి చర్యలు చేపడుతున్న ప్రభుత్వం జర్నలిస్టుల విషయంలో మాత్రం ఆసక్తి చూపడం లేదన్నారు. ప్రధానంగా ఇళ్ల స్థలాలు, ఇళ్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని, జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కొరకు ఏర్పాటు చేసిన జేహెచ్ఎస్‌ను పూర్తి స్థాయిలో అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రధానంగా ఈ రెండు డిమాండ్‌లతో కూడిన పోస్ట్ కార్డులను పెద్ద సంఖ్యలో ప్రగతి భవన్‌కు పంపించి ఆందోళన చేపట్టాలన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- మాడ్గుల మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంతాలు, తండాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఆయన చెప్పారు. మాడ్గుల మండలం జయరాంతండా, దుబ్బతండాలో మంగళవారం సీసీ రోడ్ల నిర్మాణానికి, అప్పారెడ్డిపల్లి గ్రామంలో పల్లె దవాఖానా భవన నిర్మాణానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. అనంతరం మాడ్గుల మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దఎత్తున నిధులు మంజూరయ్యాయని ఆయన వివరించారు. నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలకు సొంత భవనాలను నిర్మిస్తున్నామని ఆయన చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి చూసి బీఆర్ఎస్‌లో భారీగా ఇతర పార్టీలనుంచి చేరికలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రజల మద్దతు, అండతో రాష్ట్రంలో మూడవసారి అధికారంలోకి వస్తామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ పద్మారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శంకర్ నాయక్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ రవి, సింగిల్‌విండో చైర్మన్ తిరుమల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, సర్పంచ్‌లు వరుసురాంనాయక్, పద్మయాదయ్య, రూపా దేవ్లానాయక్, యాదయ్య, యాదిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వెంకటయ్య, తిరుపతమ్మ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించండి

పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి



సభ్యత్వం అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రెండవ పీఆర్‌సీ కమిటీని నియమించడంతో పాటు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ టీఎస్–2023 సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఉపాధ్యాయులకు సభ్యత్వాలను అందజేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దుచేసి ఆగస్టు 15లోగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. రంగారెడ్డి జిల్లాలో నిరంతరం మండల శాఖలు, జిల్లా శాఖ ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండి సేవ చేస్తున్నారని కావున జిల్లాలోని ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా సంఘం సభ్యత్వాన్ని తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, పీఆర్‌టీయూ ఇబ్రహీంపట్నం అధ్యక్షులు పరమేష్, రామ్మోహన్, అశోక్, జంగయ్య, బుచ్చయ్య, విజయలక్ష్మి, బబ్లీ, ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన ఉపాధ్యాయులు..

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.గోవర్ధన్ యాదవ్ కోరారు. ఉపాధ్యాయుల సమస్యలపై జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతీమ సింగ్‌ను పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో కలిశారు. ఉపాధ్యాయ సమస్యలపై అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు పరమేష్, కృష్ణారెడ్డి, హనుమంతు, మధుకర్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

కడ్తాల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 2023–24 సంవత్సరానికి గాను మండల పరిధిలో పండ్లతోటల పెంపకానికి ఈనెల 31 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండ్ల తోటల పెంపకానికి 5 ఎకరాలలోపు భూమి ఉండి జాబ్ కార్డు, బోరుబావి, ఎలక్ట్రిసిటీ సదుపాయం గల ఎస్సీ, ఎస్టీ, చిన్న–సన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. అర్హులైన రైతులు దరఖాస్తుపత్రం, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు, ఉపాధి కార్డు, గ్రామ పంచాయతీ తీర్మాణం తదితర జిరాక్స్ పత్రాలతో పాటు, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో గ్రామ పంచాయతీ కార్యదర్శిని గాని, ఏఈఓ లేదా ఈజీఎస్ ఏపీఓను సంప్రదించాలని కోరారు.

రేపు చలో కలెక్టరేట్

మంచాల: డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ కోరారు. మంగళవారం మంచాల మండలంలోని జాపాల, అస్మత్‌పూర్, మంచాల, చాంద్‌ఖాన్‌గూడ గ్రామాల్లో చలో కలెక్టరేట్ ముట్టడి వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. మత్స్యకారులకు 90శాతం సబ్సిడీతో అన్నిరకాల వాహనాలు, వృత్తి పరికరాలు అందించాలన్నారు. అందుకు దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 20వ తేదీ వరకు పొడగించాలన్నారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు నర్సింహ, మత్స్యకార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

లక్షమంది విద్యార్థులతో బహిరంగ సభ: ఏబీవీపీ

కడ్తాల్: విద్యారంగ సమస్యలపై వచ్చేనెల 1న సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో లక్షమంది విద్యార్థులతో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్యామ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏబీవీపీ నాయకులు ఇంటింటికెళ్లి రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ ఉదాసీనత విధానాలపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు రాకేశ్, అరుణ్, రాఘవ, పవన్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

పార్టీ సీనియర్ నేత రాఘవేందర్‌రెడ్డి



ఆమనగల్లు: ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. మాడ్గుల మండలం కుబ్యతండాలో మంగళవారం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా తండాలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో హామీ ఇచ్చిన విధంగా ఆంజనేయస్వామి గుడి నిర్మాణానికి ఆలయ కమిటీ సభ్యులకు ఆయన రూ.50 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, మాజీ సర్పంచ్ బాషానాయక్, స్థానిక నాయకులు సరేందర్, హరిలాల్‌నాయక్, విష్ణు, రవీందర్, మల్లేష్, రాజు, రమేశ్, రవి, జగన్, శంకర్, గోపాల్, సురేశ్, రఘు పాల్గొన్నారు. అనంతరం బ్రాహ్మణపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స తీసుకుంటున్న వార్డు సభ్యులు పులికంటి కొమరయ్యను రాఘవేందర్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత..

కడ్తాల్: మండల కేంద్రంలోని శివాలయం కాలనీలో నివసిస్తున్న నిరుపేద మహిళ నీలం యాదమ్మ కుటుంబానికి, ఐక్యతా ఫౌండేషన్ చేయూతనందించింది. యాదమ్మ కుటుంబానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి హామీ మేరకు రెండు గదుల ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించింది. మంగళవారం కాంగ్రెస్ నాయకులు, ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు బుచ్చయ్య, వెంకటేశ్, జంగయ్య, రమేశ్, వెంకటేశ్, పాండు, యాదగిరి, రఘు ఉన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కడ్తాల్: సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

కడ్తాల్: వీఆర్‌లకు రెగ్యులర్ పేస్కేల్ అమలు చేయడంతో పాటు అవసరం ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల్లో విలీనం చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయడం హర్షణీయమని జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్‌ఏలతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు.. శ్రీకాంత్, యాదమ్మ, మహేశ్, దశరథ్, గోపాల్, శ్రీహరి, లింగయ్య, రాంచంద్రయ్య, సురేశ్, రాములు, శ్రీశైలం, నర్సింహ, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయడంతో పాటు ఇతర శాఖల్లో తమకు చోటు కల్పించడ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఆవరణలో మంగళవారం వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్, శేఖర్, మంజుల, హేమలత, పెంటమ్మ, బాలమణి, యాదగిరి, మల్లేష్, చంద్రమౌళి, తదితర వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

మండల కేంద్రంగా ప్రకటించేవరకు ఉద్యమం

పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి



దీక్షా శిబిరంలో మోహన్‌రెడ్డి, నాయకులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు మంగళవారానికి 23వ రోజుకు చేరుకున్నాయి. పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి వారి దీక్షకు మద్దతు తెలిపారు. అదేవిధంగా మండల పరిధిలోని వెల్జాల్ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే గట్టుఇప్పలపల్లితో పాటు, వెల్జాల్‌ను కూడా మండల కేంద్రాలుగా ఏర్పాటు చేస్తామని భరోసా పలికారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్వాన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్యగుప్తా, మాజీ ఎంపీటీసీ రాములు, సీనియర్ నాయకులు డేవిడ్, దామోదర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శివగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జంగమ్మ, మైసయ్య, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



మృతుడి భార్యకు చెక్కు అందిస్తున్న కసిరెడ్డి

ఆమనగల్లు: బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కుందారం తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, బ్రిలియంట్ విద్యాసంస్థల మాజీ ఉద్యోగి శేషన్‌నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి పరామర్శించిన సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో మంగళవారం శేషన్‌నాయక్ భార్య పద్మావతి, కుమారులు దినేశ్‌కార్తీక్, చేతన్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మృతుడి భార్య పద్మావతికి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి వ్యక్తిగతంగా రూ.5 లక్షలు ఆర్థికసాయం అందించారు. అదేవిధంగా మృతుడి ఇద్దరు కుమారులను తమ విద్యా సంస్థల్లో ఉచితంగా చదివిస్తామని, భవిష్యత్‌లో చదువుకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ వారికి హామీ ఇచ్చారు. గోపీనాయక్, బిచ్చానాయక్,రామకృష్ణారెడ్డి ఉన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు పంపిణీ చేస్తున్న రాంపాల్‌నాయక్

ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్

ఆమనగల్లు: ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని 15వ వార్డు పరిధిలోని వివిధ కాలనీల్లో మంగళవారం కౌన్సిలర్ లక్ష్మణ్‌తో కలిసి చైర్మన్ రాంపాల్‌నాయక్ హరితహారంలో భాగంగా ఇంటింటికి పూలమొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. హరితహారంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అందించే పూలమొక్కలను ఇంట్లో నాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

బాధ్యతగా తీసుకోవాలి..

యాచారం: మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల పరిధిలోని తక్కళ్లపల్లి గ్రామంలో మంగళవారం ఆమె మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగాస్వాములు కావాలని సూచించారు.

విరివిగా మొక్కలు నాటాలి..

తలకొండపల్లి: నాటిన ప్రతి మొక్కను బతికించుకోవాలని సర్పంచ్ కాడమోని శ్రీశైలం అన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్‌లో హరితాహారంలో భాగంగా మంగళవారం ఉప సర్పంచ్ తిరుపతితో కలిసి సర్పంచ్ శ్రీశైలం ప్రతి ఇంటికి మొక్కలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి జంగయ్య, మేట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- మణిపూర్ దాడులపై విపక్షాల ఆగ్రహం
- పలుచోట్ల ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మల దహనం



ఇబ్రహీంపట్నం: మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

ఇబ్రహీంపట్నం: మణిపూర్‌లో మతోన్మాదులు చేస్తున్న దాడులను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కావలి నర్సింహ మాట్లాడుతూ.. మోదీ పాలనలో దేశంలో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌అరాచకాలు దేశంలో పెరిగిపోయాయని మైనార్టీలపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దోషులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ కార్యవర్గసభ్యురాలునీలమ్మ, నాయకులు లక్ష్మయ్య, విజయ్‌కుమార్, నర్సింహ పాల్గొన్నారు.

ఆమనగల్లులో ఎస్ఎఫ్ఐ ర్యాలీ..

ఆమనగల్లు: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మణిపూర్ ఘటనను నిరసిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. మణిపూర్‌లోజరుగుతున్న అరాచకాలను, అల్లర్లను అరికట్టడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, ఆదర్శ్, శివకుమార్, పవన్, శ్రీకాంత్, శివరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగర్ రహదారిపై నిరసన ర్యాలీ..

తుర్కయంజాల్: మణిపూర్‌లో హింసకు పాల్పడిన దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని, హింసను అదుపు చేయలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజీనామా చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు యాదయ్య, జిల్లా నాయకులు కిషన్ డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనలకు వ్యతిరేకంగా మంగళవారం తుర్కయంజాల్‌లో సాగర్ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ ఘటన దేశం మొత్తాన్ని కలచివేసిందన్నారు. నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా. ప్రధాని మోదీ పదవులకు రాజీనామా చేయాలన్నారు. నాయకులు ఆశీర్వాదం, సత్యనారాయణ, యాదగిరి, జంగయ్య, మాధవరెడ్డి, కృష్ణ, శివ ప్రసాద్, రాజు, భాస్కర్, శివకుమార్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

సమ్మెకు మద్దతు తెలిపిన వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు



కడ్తాల్: జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టిన జీపీ కార్మికులు

కడ్తాల్: పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డీసీసీ అధికార ప్రతినిధి, జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై పంచాయతీ కార్మికులు రాస్తారోకో చేపట్టారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి వారికి సంఘీభావం తెలిపి రాస్తారోకోలో పాల్గొన్నారు. కార్మికుల సమ్మెతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు పెరిగిపోయాయని, వెంటనే వారి డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ అండంగా ఉంటుందని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు కార్మికుల పక్షాన పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాలు పుష్ప, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు క్యామ శేఖర్, సత్యంయాదవ్, రాజేశ్, భానుకిరణ్, శ్రీకాంత్, శివ, నర్సింహ, రమేశ్, పంచాయతీ కార్మికులు ఉన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి 20వ రోజుకు చేరుకుంది. కనీస వేతనం రూ.19,500 ఇవ్వాలని, జీఓ నంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి, పాత కేటగిరి విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికుల అధ్యక్షురాలు యాదమ్మ, కోకన్వీనర్ రవలి, సభ్యులు యాదమ్మ, భిక్షపతి, అలివేలు, జంగమ్మ, అలివేలు, సుగుణమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

మంచాల: గ్రామ పంచాయతీ కార్మికుల విషయంలో ప్రభుత్వం స్పందించాలని సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ డిమాండ్ చేశారు. మంచాల మండల కార్యాలయం వద్ద జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారంతో 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులు గత 50 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. పంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు గ్యార పాండు, మండల అధ్యక్షుడు ఖాజాపాష, ప్రధాన కార్యదర్శి భాస్కర్, నాయకులు శంకరయ్య,సురేష్, రవి, సుజాత, నర్సమ్మ, భారతమ్మ, మల్లమ్మ, జంగయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యుడి రాజీనామా..

యాచారం: కరోనా సమయంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా నిర్లక్ష్య వైఖరి అవలంభించడాన్ని నిరసిస్తూ బుధవారం యాచారం గ్రామ పంచాయతీ వార్డు సభ్యత్వానికి ఎండీ.గౌస్ రాజీనామా చేశారు. తన రాజీనామ పత్రాన్ని ఎంపీడీఓ విజయలక్ష్మికి అందజేశారు. పంచాయతీ సిబ్బంది 20 రోజులుగా సమ్మె చేస్తున్నా సర్కార్‌లో కొంచెమైనా స్పందన లేకపోవడం సరైంది కాదని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తనలాగా మరెంతోమంది ప్రజాప్రతినిధులు రాజీనామాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.

నిర్లక్ష్యం సరికాదు..

యాచారం: సీఎం కేసీఆర్ అన్ని శాఖాల్లోని ఉద్యోగులకు మేలు చేస్తూ పంచాయతీ సిబ్బంది సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. యాచారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేస్తున్న పంచాయతీ సిబ్బంది సమ్మెకు మంగళవారం సీపీఎం పార్టీ మద్దతు తెలిపింది. పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించని పక్షంలో సీపీఎం పార్టీ ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ సిబ్బందితో కలిసి యాచారంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్, సీపీఎం నాయకులు పి. అంజయ్య, అరుణ్‌కుమార్, వెంకటయ్య, జంగయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.